ఆర్‌వోబీల నిర్మాణానికి సన్నాహాలు

- స్థల సేకరణ పనిలో రైల్వే, రెవెన్యూ అధికారులు
- ప్రజలకు తీరనున్న రైల్వే గేటు కష్టాలు


ఉంగుటూరు: మండలంలో రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలకు రైల్వే శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ఇప్పటికే పలుమార్లు హైవే అధికారులు, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖ, రైల్వే అధికారులు రైల్వేగేట్లు ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ మేరకు ఏ విధంగా నిర్మిస్తే ప్రభుత్వానికి తక్కువ ఖర్చు అవుతుంది. ఏ రకంగా నిర్మిస్తే మేలు అనే విషయాలపై ఒక అవగాహనకు వచ్చినట్లు సమాచారం. ఉంగుటూరు, చేబ్రోలు, బాదంపూడి, కైకరం, ప్రధాన రైల్వే గేట్లతో పాటు నాచుగుంట, వెల్లమిల్లిలో ఆర్‌వోబీలు నిర్మించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. భవిషత్‌లో రైల్వే గేట్లు లేకుండా చేయాలని రైల్వే శాఖ యోచిస్తోంది. ఈ మేరకు రైల్వే ఫ్లై ఓవర్లు నిర్మిస్తే ప్రజలకు గేట్ల బాధ తప్పుతుందని రైల్వే అధికారుల ఆలోచన. దీంతో ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అలాగే కొన్ని చోట్లు అండర్ పాస్‌లను కూడా అభివృద్ధి చేయనున్నారు. ఉంగుటూరు రైల్వే గేటుకు బదులుగా మూడు చోట్ల నుంచి ఫ్లై ఓవర్ నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేసుకున్నారు. ఇప్పుడున్న రైల్వే గేటు ప్రాంతం నుంచి ఒకటి, ఉంగుటూరు ఊరి శివారు నారాయణపురం వైపు ఒకటి, అలాగే వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి ఒకటి ఫ్లై ఓవరు బ్రిడ్జిలు నిర్మిస్తే ఎలా ఉంటుందనే తర్జన భర్జనలు పడుతున్నారు. సెంటరు నుంచి, ఇప్పుడున్న రైల్వే గేటు ప్రాంతం నుంచి ఒక ప్రతిపాదన, ఈ మూడింటిలో వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి నిర్మించే ఫ్లై ఓవరు నిర్మిస్తే బాగుంటుందనే అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఆర్‌వోబీ హైవే మీద నుంచి టవర్ పక్క నుంచి రైల్వే ట్రాక్ దాటాక పొలాల మీదుగా వచ్చి హైస్కూలు ప్రాంతంలో నీలాద్రిపురం రహదారిలో కలిసేలా స్కెచ్ తయారు చేశారు.


చేబ్రోలు రైల్వే గేటు


ఉంగుటూరు రైల్వేగేటు రద్దీగా ఉండే ప్రదేశం ఇదే

ప్రాజెక్టు రిపోర్టులు ఇలా..

కైకరంలో నిర్మించే ఆర్‌వోబీ (ఎల్‌సీ 364) నిర్మాణానికి 6 ఎకరాల 84 సెంట్ల ప్రైవేటు భూమి అవసరంగా గుర్తించారు. ఈ భూమికి చెందిన లబ్ధిదారులను గుర్తించి సేకరించే పనిలో రెవెన్యూ అధికారులు ఉన్నారు. కైకరం ఫ్లై ఓవర్ ఇప్పుడున్న గోకవరం రోడ్డు మీదనే పైకి లేపి గేటు దాటాక పాత దళిత వాడ శివారులో దిగనుంది. చేబ్రోలు ఆర్‌వోబీకి ఎల్‌సీ 365కి 7 ఎకరాలు 72 సెంట్లు ప్రైవేటు భూమి అవసరంగా గుర్తించారు. ఈ బ్రిడ్జి చేబ్రోలు సుబ్రహ్మణ్య స్వామి గుడి వద్ద పైకి లేచి గేటు ఉన్న ప్రాంతం పైనుంచి సాయిరాం థియేటర్ దాటాక దూబచర్ల రోడ్డులో కలుపుతారు. ఉంగుటూరులో ఎల్‌సీ 366కి 17 ఎకరాల 48 సెంట్లు అవసరంగా గుర్తించారు. వెల్లమిల్లి గ్రామంలో ఎల్‌సీ 368కి 2 ఎకరాల 35 సెంట్ల భూమి అవసరంగా గుర్తించారు. నాచుగుంట గ్రామంలో ఎల్‌సీ 367కి 7 ఎకరాల 48 సెంట్ల భూమి అవసరంగా గుర్తించారు. బాదంపూడి గ్రామంలో ఎల్‌సీ 369కి సుమారు 6 ఎకరాల 79 సెంట్ల భూమి అవసరంగా గుర్తించారు. ఈ మేరకు ఈ ఆరు ఆర్‌వోబీలకు స్థల సేకరణ పనులు ముమ్మరంగా చేస్తున్నారు.



బాదంపూడిలో ఆర్‌వోబీ నిర్మాణానికి చెందిన స్కెచ్

నేడు కైకరం రైల్వే అధికారుల రాక

కైకరం, బాదంపూడి ఆర్‌వోబీలకు పూర్తిగా క్లియరెన్స్ రావడంతో త్వరితగతిన పనులు ప్రారంభిస్తారని అంటున్నారు. ఈ మేరకు రైల్వే అధికారులు కైకరం రేల్వే గేటు ప్రాంతాన్ని పరిశీలించేందుకు రైల్వే అధికారులు, మిగిలిన శాఖల అధికారులు కైకరం మంగళవారం రానున్నారు. ఈ మేరకు మరోమారు పరిశీలన చేస్తారు.

చినుకు పడితే చిత్తడే..


గుండుగొలనులోని ఆర్‌అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గుంతలు


గుండుగొలను-భోగాపురం పంచాయతీరాజ్ రోడ్డులో ఏర్పడిన భారీ గుంత

భీమడోలు: మేజర్ పంచాయతీ గుండుగొలనులో రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లు సైతం ఛిద్రమయ్యాయి. దీంతో చిన్నపాటి వర్షానికి ప్రధాన రోడ్లపై నీరు నిలిచి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. కొన్నేళ్లుగా ఈ పరిస్థితులున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో చిన్నపాటి గుంతలు భారీగా మారుతున్నాయి. ఇలాంటి రోడ్లను వర్షాలు రాకముందే మరమ్మతులు చేయించాల్సి ఉండగా తమకు పట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా రోడ్లకిరువైపులా కనీసం డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్లపై నిలిచిపోతుంది. దీంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన రోడ్లు గుంతలతో నిండిపోతున్నాయి. గుండుగొలను ఆర్‌అండ్‌బీ రహదారి బంటు కాంప్లెక్స్ వద్ద, డైరీ మార్కెట్ వద్ద గుంతల్లో నీరు నిలవడంతో గుర్తించని వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం పంచాయతీ అధికారులు డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చకపోవడంతో అసలే గుంతలమయమైన రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇదిలా గుండుగొలను యూనియన్ బ్యాంకు నుంచి ప్రభుత్వ పీహెచ్‌సీకి వెళ్లే దారి పొడవునా గుంతల్లో నీరు చేరింది. గుండుగొలను నుంచి భోగాపురం వెళ్లే పంచాయతీరాజ్ రహదారి పూళ్ల వీధి వద్ద నడి రోడ్డున భారీ గొయ్యి ఏర్పడింది. అసలే గ్రావెల్ రోడ్డు కావడంతో అది కాస్త లేచిపోయి ఎక్కడపడితే అక్కడ గుంతలతో నిండిపోయింది. గుండుగొలను నుంచి భోగాపురం మీదుగా కొల్లేరు గ్రామాలకు వెళ్లే ఆటోలు, వాహనదారుల ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఇలాంటి రోడ్లపై రాకపోకలు సాగించడం వలన వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ఆటో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు గుంతలను పూడ్చాలని, రోడ్లకిరువైపులా డ్రెయిన్లను తీయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంజనీర్లకు ఆదర్శనీయుడు విశ్వేశ్వరయ్య

దెందులూరు: భారతదేశంలో పలు నదులపై వంతెనలు, ఆనకట్టలు కట్టిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య నేటి ఇంజనీర్లకు ఆదర్శనీయమని బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. సోమవారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి కళాశాల అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను ప్రముఖమైన నిర్మాణాలను నైపుణ్యత దూర దృష్టిని నర్సింగ్ సీనియర్ విద్యార్థిని డి.అఖిల అవగాహన కల్పించారు.


మోక్షగుండం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న నర్సింగ్ విద్యార్థులు

ఇంజనీర్లకు సత్కారం

ఉంగుటూరు: నారాయణపురం బ్రిడ్జి పనులు వేగంగా పూర్తి చేయిస్తున్న ఇంజనీర్లు, డీఈ ఏఈలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఇంజనీర్స్ డే సందర్భంగా సత్కరించారు. బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. దాతల సహకారంతో బ్రిడ్జి మరమ్మతులు జరుగుతున్న విషయం విదితమే. కార్యక్రమంలో పలువురు పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జోరువానతో సైఫన్ పైకి వరద నీరు


సైఫన్‌పై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

దెందులూరు: దెందులూరు సైఫన్‌పై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మహిళలకు, వృద్ధులకు, చిన్నారులకు, వాహనదారులకు రాకపోకలకు వరద ప్రవాహం తీవ్ర ఇబ్బందిగా మారింది. ప్రతిఏటా వరద ఉధృతం కావడంతో వర్షాలు సాధారణంగా వస్తాయి కాబట్టి రెండు వైపులా పట్టుకుని నడవడానికి గతంలో మాదిరి రైలింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు, పాదచారులు అధికారులను కోరుతున్నారు. గత రెండు రోజులుగా తుఫాను నేపథ్యంలో జోరు వాన కురుస్తుంది. డ్రెయిన్లు నిండిపోయి మురుగు నీరు రోడ్డుపై నుంచి వెళుతోంది. సానిగూడెం, శ్రీరామవరం గ్రామాల్లో ఆయిల్‌పామ్ తోటల్లో వర్షపు నీరు చేరింది. వరి పొలాల్లో సైతం నీరు అధికం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి


మాజీ హోంమంత్రి వనితకు పూల బొకేను అందిస్తున్న జ్యోతి శ్రీనివాస్

ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శిగా ఇటీవల నియమితులైన ద్వారకాతిరుమలకు చెందిన పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, మాజీ హోం మంత్రి తానేటి వనితకు కృతజ్ఞతలు తెలిపారు. తాడేపల్లిగూడెంలోని ఆమె నివాసం వద్ద పార్టీ మండల నాయకులతో మర్యాద పూర్వకంగా కలసిన ఆయన ముందుగా వనితకు శాలువా కప్పి, పూల బొకేను అందించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వనిత సూచించారు. పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, మండల మహిళా అధ్యక్షురాలు మల్లిపూడి నాగమణి, రాష్ట్ర మైనారిటీ సెల్ సంయుక్త కార్యదర్శి షేక్ మస్తాన్ బాషా, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దాసరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు విగ్రహాలు సిద్ధం


దసరాకు సిద్ధమైన అమ్మవారి విగ్రహాలు

దెందులూరు: దసరా మహోత్సవాలకు పలు రూపాల్లో కనకదుర్గమ్మ విగ్రహాలు సిద్ధమయ్యాయి. గోపన్నపాలెం పాత సినిమా హాలు సెంటర్ వద్ద తయారీదారుడు నాని అమ్మవారి విగ్రహాలు అమ్ముతున్నారు. పెద్దవి రూ.17,500, చిన్నవి రూ.8500 అమ్ముతున్నామన్నారు. ఇప్పటికే పలు గ్రామాల నుంచి దసరా ఉత్సవాల నిర్వాహకులు అమ్మవారి విగ్రహాలను కొనుగోలు చేశారు.

వైఎస్సార్ స్మారక ఘాట్‌ను సందర్శించిన నేతలు


ఇడుపుల పాయలో మహానేత వైఎస్సార్ స్మారక ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: ఇడుపులపాయలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్మారక ఘాట్‌ని వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం సందర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కుక్కల ధర్మరాజు, నాయకులు పిట్టా సురేష్, వైఎస్సార్ కడప జిల్లా పెండ్లిమర్రి మండలం వెల్లటూరి సర్పంచ్ కె.హుస్సేన్ సాబ్, వైఎస్సార్ కడప జిల్లా వీరపునాయినిపల్లి మండలం గంగిరెడ్డిపల్లి ఉప సర్పంచ్ బైరెడ్డి కిషోర్, జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ నాయకులు చిత్తపూరి శేఖర్, మహమ్మద్ ఉమర్ షరీఫ్, గుబ్బల వెంకటేశ్వరరావు, వీరవల్లి సోమేశ్వరరావు, యాక్టర్ భాషా, కోరుమిల్లి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను అభివృద్ధి చేయాలి


వినతి పత్రం అందజేస్తున్న సామాజిక కార్యకర్తలు

టి.నరసాపురం: అధ్వానంగా మారిన టి.నరసాపురం అంబేడ్కర్ సెంటర్ నుంచి సినిమా హాల్ సెంటర్ వరకు రోడ్డు అభివృద్ధి చేయాలని సామాజిక కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఎంపీడీవో నగరాజకుమారి, తహసీల్దార్ తోట సాయిబాబాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్ పాషా మాట్లాడుతూ మండల కేంద్రమైన టి.నరసాపురం అంబేడ్కర్ సెంటర్ నుంచి సినిమా హాల్ సెంటర్ వరకు రోడ్డు గుంతలతో ఛిద్రంగా మారిందన్నారు. డ్రెయిన్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం కురిస్తే ప్రధాన రోడ్డు పంట కాలువలా మారుతుందన్నారు. రోడ్డును వెంటనే నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జమీల బేగం, సామాజిక కార్యకర్తలు కొరివి వెంకటేశ్వరరావు, కొరివి నాగేశ్వరరావు, పింగుల మధు, రెడ్డి శ్రీనివాస్, బొడ్డపాటి రమేష్, నార్లపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు బాలరాజు పరామర్శ


జంగా ప్రతాపరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బాలరాజు

టి.నరసాపురం: బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అన్ని వేళలా అందుబాటులో ఉంటుందని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండంలోని మల్లుకుంటలో పలు కుటుంబాలను పరామర్శించారు. దీనిలో భాగంగా గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న గాది కృష్ణారెడ్డిని పరామర్శించారు. గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జంగా ప్రతాపరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనురాజు, తమ్మారి శ్రీనివాసరెడ్డి, పులగం వసంత రెడ్డి, నరసింహారావు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూసేకరణ చేయాలి

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం సేకరిస్తున్న భూములకు సంబంధించి టైటిల్ వెరిఫికేషన్ లింక్ డాక్యుమెంట్ల ఆధారంగా పారదర్శకంగా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. బుట్టాయగూడెంలో ఆదివాసీ విజ్ఞాన కేంద్రం భవనం వద్ద ఉడతా వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం ఆ పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా సెక్రటరీ సభ్యురాలు మొడియం నాగమణి, నాయకులు తెల్లం రామకృష్ణ, కారం భాస్కర్, పూనెం శేఖర్, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళన


రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గణపవరం : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే వరకూ ఉపాధ్యాయులు ఉద్యమాలకు సిద్ధం కావాలని యూటీఎఫ్ నాయకులు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సోమవారం గణపవరం మండలం యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరి ఉద్యమానికి సంబంధించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. తమ న్యాయమైన డిమాండ్లు సాధించుకునే వరకూ ఉపాధ్యాయులు కలసికట్టుగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రత్నరాజు, రమేష్, భవాని ప్రసాద్, మూరా చిన్న ఏసు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి భజన మండలి ప్రారంభం


లక్ష్మణరావుకు స్వాగతం పలుకుతున్న భజన మండలి సభ్యులు

ఉంగుటూరు: కైకరం కళింగ రామాలయంలో భగవాన్ సత్యసాయి భజన మండలి ప్రారంభోత్సవానికి సోమవారం భగవాన్ సత్యసాయి సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కూనా అప్పారావు దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం భజన మండలిని ప్రారంభించారు. సత్యసాయిబాబా భజన మండల అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి


పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

నిడమర్రు : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా పాడి రైతులు వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ వీఎస్ సందీప్ తెలిపారు. సోమవారం మండలంలో గాలి కుంటు వ్యాధి టీకాల కార్యక్రమం పెదనింద్రకొలనులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. పెదనింద్రకొలనులో ఈ నెల 18 వరకూ ఉంటుందన్నారు. 17న ఎనికేపల్లి, కాకరమిల్లి గ్రామాల్లో ఉంటుందన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వీరప్రసాద్

నిడమర్రు: విద్యార్థినులు, మహిళలకు అమలవుతున్న భద్రతా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై వీరప్రసాద్ తెలిపారు. సోమవారం బవాయిపాలెంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో విద్యార్థులకు బాలికల సంరక్షణ చట్టాలు, సైబర్‌క్రైం మోసాలు, రహదారి భద్రత చట్టాలు వెంటి వాటిపై అవగాహన కల్పించారు. సిగరెట్, మద్యం, మాదకద్రవ్యాల వంటివి తీసుకోవడం వలన వచ్చే అనర్థాలు, పలు కేసుల్లో సంఘనలు వివరించారు.

శరణు ఘోషతో మారుమోగిన అడవికొలను


శబరిమలకు ఇరుముళ్లతో బయలుదేరుతున్న అయ్యప్ప మాలధారులు

నిడమర్రు: అడవికొలను గ్రామం సోమవారం అయ్యప్ప శరణు ఘోషతో మారుమోగింది. గ్రామంలో 17 మంది స్వాములు 32వ సారి శబమరిమల యాత్రకు బయలు దేరి వెళ్లారు. గరుస్వామి వంకాయల సాయి స్వామి ఆధ్వర్యంలో పి.తిరుమలరావు, నిమ్మల జయప్రకాష్‌నారాయణ, బాలజీ గురుస్వాములు ఇరుముళ్ల కట్టించి, మాలాధారులను శబరిమల యాత్రకు తీసుకెళ్లారు.

ఐఆర్ ప్రకటించాలి

జంగారెడ్డిగూడెం: సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు నిరసన వారంలో భాగంగా సోమవారం జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏపీటీఎఫ్ నేతలు ఎ.దయరాజు, గోపిశ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

భీమడోలు/దెందులూరు: భీమడోలు సబ్ స్టేషన్‌లోని బ్రేకర్ మార్పు చేయడం, మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు వ్యవసాయ, తాగునీటికి చెందిన త్రీఫేజ్ సర్వీసులకు ఉదయం 2 నుంచి 9 గంటల వరకు, రాత్రి 10 నుంచి 12 గంటలకు వరకు విద్యుత్ సరఫరా చేస్తామని ఏలూరు ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. సోమవారం రాత్రి ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఈ నేపథ్యంలో విద్యుత్ కేంద్రం పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, పెదవేగి, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల వ్యవసాయ, ఇతర విద్యుత్ వినియోగదారులు గమనించుకోవాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి


మాజీ ఎమ్మెల్యేను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దెందులూరు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పార్టీ నూతన కమిటీలు సమర్థవంతంగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో పార్టీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నేటూరి సాయి కృష్ణ యాదవ్ అబ్బయ్య చౌదరిని కలిసి కృతజ్ఞతలు తెలియజేసి సత్కరించారు. అనంతరం సాయికృష్ణను అబ్బయ్యచౌదరి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాటి సుధాకర్, జిల్లా కార్యదర్శి బండ్ల విజయకుమార్ (పండు), గొల్ల సూర్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు డ్రోన్ల పంపిణీ


డ్రోన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: రైతులకు డ్రోన్ల పంపిణీ కార్యక్రమం ఉంగుటూరు ఎమ్మెల్యే సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు డ్రోన్లను నిడమర్రు మండల రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సూరత్తుల అయ్యప్ప, వంగా రఘు, పాతూరి విజయ కుమార్, కడియాల రవిశంకర్, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి ఆర్థిక సాయం

బుట్టాయగూడెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమైన ఒక యువకుడికి కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.5 వేల నగదుతో పాటు మరో రూ.5 వేల విలువ చేసే నిత్యవసర సరుకులను సోమవారం ఆ సంఘ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘ కార్యదర్శి శీలం కృష్ణంరాజు, ట్రెజరర్ పి.మోహన్, సహాయ కార్యదర్శి మణికె సత్యనారాయణ, సంస్థ ప్రతినిధులు ఉద్దండం ఏసుబాబు, కేఎస్ శంకరరావు, ఆకుల ఏసుబాబు, స్థానిక కాపు ప్రతినిధులు సురేష్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.